క్లుప్తంగా

ముగిసిన ఉత్సవాలు



ఉత్సవాలకు హాజరైన నాయకులకు సన్మానం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలో హజ్రత్ సయ్యద్ అలీ మీరన్ దాతర్ దర్గా ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా ముంగి గ్రామం నుంచి ప్రజలు గంధంతో తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారిని నిర్వాహకులు సయ్యద్ శకీల్ ఘనంగా సన్మానించారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలు పడే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. బుధవారం పట్టణంలో రెండు రోజుల క్రితం భారీ వర్షం కారణంగా ఇల్లు కూలిపోయిన సురేశ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రధానంగా వర్షాలు పడే సమయంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురేశ్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న
లీడ్ బ్యాంకు అధికారి నర్సింహారావు

జహీరాబాద్: మండలంలోని మల్‌చల్మ గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నర్సింహారావు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గల అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన్, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ అనవింద్, పంచాయతీ కార్యదర్శి సరిత, ఏఈఓ శివపార్వతి, విజయ్‌కుమార్, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న సత్య సేవా సమితి సభ్యులు

పటాన్‌చెరుటౌన్: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సత్య సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో మానవ విలువలను గుర్తించడం, సత్యాన్ని కాపాడడం, ఇతరులకు సేవ చేసే లక్షణాలను విద్యార్థులు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సత్య సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శంకరప్ప, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణతో పాటు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ పూనమ్, డాక్టర్ యోగి బాబు, డాక్టర్ సురేష్ కుమార్ ఇతర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కంగ్టి(నారాయణఖేడ్): కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఓ ఎద్దును బలిగొంది. ఈ ఘటన మండలంలోని నాగుర్(బీ) గ్రామ శివారులో చోటుచేసుకొంది. మండలంలోని సిద్ధంగిర్గా గ్రామానికి చెందిన ముంగె గోపాల్‌రెడ్డికి చెందిన ఎద్దు గ్రామశివారులో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. దాదాపు ఎద్దు విలువ రూ. లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

సంగారెడ్డి పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. జిల్లా కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. పట్టణంలో సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఏర్పడుతుంది. పాదచారుల కోసం సరైన పుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల రహదారి ఆక్రమణలు, వాహనాల రద్దీ వంటి కారణాలతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది.

– సంగారెడ్డి టౌన్:

రోడ్డుపైనే పార్కింగ్

ట్రాఫిక్‌తో నిత్యం అవస్థలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు,పాదచారులు
- సమస్యను పరిష్కరించాలి: పట్టణవాసులు



సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు

వాహనాలను కట్టడి చేయాలి

మార్కెట్ సమయంలో రోడ్లపై వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా నిలుపుతున్నారు. సంగారెడ్డిలోని పాత బస్టాండ్, కలెక్టరేట్, బైపాస్ రోడ్లలో మార్కెట్‌లు ఉన్నాయి. రోడ్లపైనే తోపుడు బండ్లు పెట్టడం, వాహనాలు నిలుపడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దుకాణాలు, వ్యాపార సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రుల ఎదుట ప్రధాన రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని పట్టణవాసులు వాపోతున్నారు. ఆటోలు నడిపే వారు పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, పోతిరెడ్డిపల్లి బస్టాండ్‌ల వద్ద రోడ్లపైనే నిలుపడంతో పాదచారులు, బస్సులో వెళ్లడానికి రోడ్లపై నిల్చున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు సరైన ప్రణాళికలు తయారు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిత్యం రోడ్లపై నిలిచే వాహనాలను కట్టడి చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



సంగారెడ్డి పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుంది. ఇష్టం వచ్చినట్లు రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– శ్రీధర్ మహేంద్ర, పట్టణవాసి

ఇష్టం వచ్చినట్లు..



ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులు సంగారెడ్డి పట్టణ బస్‌స్టాప్‌తో పాటు చౌరస్తాలో బస్సులో ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్లపై ఆటోలు ఇష్టం వచ్చినట్టుగా ఆపుతున్నారు. కొన్ని సందర్భాల్లో బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారు. సమస్యపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– శివదత్త గౌడ్, ఉద్యోగస్తుడు

త్వరలో పరిష్కరిస్తాం



పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉన్న విషయం వాస్తవమే. మార్కెట్ సమయాల్లో రోడ్లపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం. ఇష్టం వచ్చినట్లు వాహనాలను నిలిపితే జరిమానాలు విధిస్తాం. ట్రాఫిక్ సిబ్బందిని రోడ్లపై ఉంచి ట్రాఫిక్‌ను కట్టడి చేస్తాం. త్వరలోనే పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తొలగిస్తాం. దుకాణదారులు ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణారెడ్డి , ట్రాఫిక్ సీఐ, సంగారెడ్డి

తండాలో ఘనంగా బోగ్ భండార్



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బాబుసింగ్ మహరాజ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం సజ్జరావుపేట తండాలో బుధవారం బాబుసింగ్ మహరాజ్ బోగ్ భండార్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్సీ బాబుసింగ్ మహరాజ్ పూజలు చేసి బోగ్ భండార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదవాలని, అక్షరాస్యతను పెంచాలని చెప్పారు. భవానీ సేవాలాల్ దీక్షలను ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధి కన్‌సాన్‌పల్లిలో బుధవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా బాలింతలకు శ్రీమంతాలు నిర్వహించారు. పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించడం వల్ల శిశువుకు దివ్యౌషధంగా పని చేస్తుందన్నారు. ఆరు నెలల వయస్సు వచ్చే వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, రామకళ, సాయమ్మ, రమాదేవి, ఏఎన్ఎం శాంతి, ఆశావర్కర్లు మాధవి, మమత పాల్గొన్నారు.

మునిపల్లి మండలంలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దచల్మెడ, తాటిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ.. బిడ్డపుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు ముర్రుపాలు తాగించాలని తల్లులకు సూచించారు.



పెద్దచల్మెడలో తల్లి పాల వారోత్సవాలు



బాలింతలకు శ్రీమంతాలు చేస్తున్న సిబ్బంది

గ్రామ విధుల్లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బ్యానర్ పట్టుకుని ప్రచారం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక, శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తల్లులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్డారంలో రూ. మూడు కోట్ల, 76 లక్షల వ్యయంతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, రుద్రారం పీఏసీఎస్ చైర్మన్ పాండు, విద్యుత్ శాఖ ఏడీ తులసీరామ్, దశరథరెడ్డి, శ్రీనివాస్, మేరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ చౌరస్తాలో గద్దర్ గళం వ్యవస్థాపకుడు కొల్లూరి సత్తయ్య ఆధ్వర్యంలో బుధవారం గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గద్దర్ ఆశయాలను, సిద్దాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో దోపిడీ, వివక్ష ఉన్నంత వరకు గద్దర్ పాట సజీవంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, వివిధపార్టీల నాయకులు రవి, శ్రీనివాస్, వడ్డే నర్సింహులు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ డంప్‌యార్డ్‌ను తొలగించండి



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలని నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డ్ నుంచి వెదజల్లే దుర్వాసనతో గాంధీనగర్ వాసులకు ఊపిరి ఆడకుండా చేస్తుందని బీఆర్ఎస్ నాయకుడు రత్నం ఆధ్వర్యంలో కమిషనర్ కిషన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అధికారులు కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు తీసుకొని డంపింగ్‌యార్డ్ మరో చోటకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

◆ దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టెలికాం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ అన్నారు. సదాశివపేట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి భద్రాచలంకు పాదయాత్రగా వెళ్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, వారి బృందాన్ని బుధవారం పటాన్‌చెరు ఓఆర్ఆర్ సమీపంలో సత్కరించారు. ఈసందర్భంగా టెలికాం బోర్డు మెంబర్ కుమార్ మాట్లాడుతూ.. పాదయాత్ర దిగ్విజయం కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



సంగారెడ్డి: రోగులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర ఆదేశాలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లోని క్యాంటీన్ ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ...పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగులకు సరిపడా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆమె వెంట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ అభిజ్ఞ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



హత్నూర(సంగారెడ్డి): విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న అభిజ్ఞ స్కూల్ యజమాన్యం వైఖరిని నిరసిస్తూ పాఠశాల ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చంద్ర మాదిగ మాట్లాడుతూ..నవాబుపేట గ్రామానికి చెందిన ఎల్లయ్య పాఠశాల ఫీజు పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా తమ పిల్లల టీసీ ఇవ్వమని అడిగితే ప్రిన్సిపాల్ అమర్యాదగా మాట్లాడారన్నారు. టీసీ కోసం రూ.1500 ఇవ్వాలని అడగడంతో ఎంఈఓకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందుల గురిచేస్తున్న అభిజ్ఞ పాఠశాల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్లలో మొగులయ్య, నాయకులు సామేలు, సత్యం, నవీన్, ప్రవీణ్, దుర్గ ప్రసాద్, ఎల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యంతోనే మరిన్ని ప్రమాణాలు

ఎమ్మెన్నార్ వర్సిటీలో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్



గరెత్ విన్ ఓవెన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెన్నార్ వర్సిటీ యాజమాన్యం

సంగారెడ్డి టౌన్: బ్రిటన్, దేశంలోని ఉన్నత విద్యా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తే మరిన్ని ప్రమాణాలు పెరుగుతాయని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామ శివారులోని ఎమ్మెన్నార్ యూనివర్సిటీని బుధవారం ఆయన సందర్శించారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవంలో భాగంగా ఓవెన్ వైద్య విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యా విషయాలపై అంతర్జాతీయ భాగస్వామ్యంతో మరిన్ని సదస్సులు నిర్వహించాలన్నారు. బ్రిటన్, దేశంలోని విశ్వవిద్యాలయాల మధ్య సహకారం విస్తరించడానికి ఉన్న అవకాశాలను ఆయన ప్రస్తావించారు. బ్రిటన్‌లో జరిగే హెల్త్ బూట్ క్యాంప్‌లో దేశంలోని విశ్వవిద్యాలయాలు పాల్గొని ప్రయోజనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణ చలం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.వి.సత్యనారాయణ, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డా.ఆర్. కిరణ్, మెడికల్ అండ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ వెంకటరమణ, అకడెమిక్స్ డీన్ డా.రవి జె, సీనియర్ సైంటిస్ట్ డా.షహీలా పర్వీన్, ఎమ్మెన్నార్ హాస్పిటల్స్ సీఈఓ సత్యనారాయణమూర్తి అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే వైద్య పరీక్షలు చేయాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా

సదాశివపేట(సంగారెడ్డి)/సంగారెడ్డి: పట్టణంలో పేదలకు తక్కువ ధరకే వైద్య పరీక్షలు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఓ ప్రైవేటు డయాగ్నొస్టిక్ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వైద్యం నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలో ఆధునిక పరికరాలతో డయాగ్నొస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సదాశివపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నర్సింహులు చికిత్సకయ్యే ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో పార్టీ శ్రేణులతో కలసి నర్సింహులును పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డాక్టర్ శ్రీహరి, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి,గోవర్ధన్‌నాయక్, మధుసూదన్‌రెడ్డి, ఎర్రోళ్ల చిన్న, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ క్రైం సీఐ రవికుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

పటాన్‌చెరుటౌన్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం సీఐ రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా ఎక్కువ వాడతారని, సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా యువతను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే రిక్వెస్ట్‌లను, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సాయికిరణ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత తప్పనిసరి



జిన్నారం (పటాన్‌చెరు): అవగాహన కల్పిస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): సైబర్ నేరాల పట్ల అప్రమత్తత తప్పనిసరిగా ఉండాలని గుమ్మడిదల ఎస్‌బీఐ ఆర్ఎం పవన్ కుమార్ రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం గుమ్మడిదల మండలంలోని కానుకుంటలో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులతో పాటు ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. బ్యాంకు సేవలను వినియోగించేటప్పుడు అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ రామచందర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీదేవి, సీఎస్పీ పాయింట్ నిర్వాహకులు అబ్దుల్, సత్తార్, శ్రీకాంత్, గ్రామస్తులు ఖాతాదారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ మహేశ్ సూచించారు. బుధవారం మండలంలోని నల్లవాగు గురుకులంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఆధార్, ఓటీపీ వివరాలు చెప్పొద్దని తెలిపారు. నమ్మించి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు ఖాళీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య పాల్గొన్నారు.

కురుమ గొల్ల యువత అధ్యక్షుడిగా శ్రీశైలం



నూతన కార్యవర్గంలో శ్రీశైలం

సంగారెడ్డి: కురుమ గొల్ల యువత సంగారెడ్డి నూతన అధ్యక్షుడిగా గంగని శ్రీశైలం బుధవారం ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కురుమ యువత అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో శ్రీశైలం గెలుపొందారు. కురుమ కులానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా శ్రీశైలం చెప్పారు. ఎన్నుకున్న కురుమ పెద్దలు డాక్టర్ శ్రీహరి,పుష్ప నాగేష్,పైతర సాయికుమార్,గూడెం మల్లయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్



జహీరాబాద్ టౌన్: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రొఫెసర్ స్వర్గీయ జయశంకర్ సర్ జయంతిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహనీయుడు జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ, నాయకులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు..

నారాయణఖేడ్: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో సిద్ధాంతకర్త, ఆచార్య జయశంకర్ పాత్ర కీలకమని పలువురు కొనియాడారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో పాల్గొన్న కమిషనర్ జగ్జీవన్, అధికారులు



నారాయణఖేడ్: జర్నలిస్టు కాలనీలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సింధు